చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

- ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు
- సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 22 : యేసుక్రీస్తు దయతో కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో ఉన్న సెయింట్ ఆండ్రూస్ సీఎస్ఐ చర్చిలో జరిగిన ప్రార్థనలో పాల్గొని పాస్టర్లతో ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నానని అన్నారు. మరోమారు తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, నాయకులు కాసుల వెంకట్, పల్లపు లక్ష్మణ్, అంబుల వేణు, పరమేశ్, కేకే శ్రీను, కొండ స్వామి, కూరపాటి సుధాకర్, పిల్లి కుమార్, మాదా శ్రీరాములు, చల్లా భాస్కర్, బోడా గణేశ్, అశోక్, కన్ని, శ్రీను, హైమత్, మున్నా, ఈశ్వర్, విల్సన్, దిడ్డి రామన్, సీఎస్ఐ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ప్రజాప్రతినిధుల మద్దతు

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 22 : నియోజకవర్గంలోని సుజాతనగర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలంలో సుమారు 90మంది ప్రజా ప్రతినిధులు ఆదివారం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తూ వనమాను మరోసారి గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, కాసుల వెంకట్, జేవీఎస్ చౌదరి, ఎంపీపీలు బదావత్ శాంతి, భూక్యా సోనా, మడివి సరస్వతి, జడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, 50మంది సర్పంచ్‌లు, 40మంది ఎంపీటీసీలు, ఏఎంసీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఆత్మకమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, సొసైటీ చైర్మన్ మండె వీరహన్మంతరావు, సుజాతనగర్ రైతు సంఘం అధ్యక్షుడు పెద్దమళ్ల నరేందర్, నిమ్మకాయల సాంబశివరావు, కొట్టి వెంకటేశ్వర్లు, తులసిరెడ్డి, సత్యనారాయణ, బత్తుల రమేశ్, లగడపాటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వనమా వెంకటేశ్వరరావుకు మద్దతు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

వనమా విజయాన్ని కాంక్షిస్తూ పూజలు

పెద్దమ్మగుడిలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాల్వంచ రూరల్, అక్టోబర్ 22 : ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న వనమా వెంకటేశ్వరావు విజయాన్ని కాంక్షిస్తూ పలువురు బీఆర్ఎస్ నాయకులు పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు మంతపూరి రాజూగౌడ్, మల్లెల శ్రీరామ్మూర్తి, ఆలయ ధర్మకర్త ఎస్వీఆర్కే ఆచార్యులు, విజయ్, ఆనంద్, లక్ష్మీనారాయణ, చిన్నపండు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులు విస్తృతంగా పర్యటించారు. దంతెలబోర, గంగదేవిగుప్ప, ఎస్సీ కాలనీ, బండ్రుగొండ, సంగెం, నారాయణరావుపేట, నాగారంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ నెల 25, 26వ తేదీల్లో వనమా వెంకటేశ్వరరావు మండలంలో పర్యటించనున్నారని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల తెలిపారు.

కొత్తగూడెంలో దసరా సందడి

- కిటకిటలాడుతున్న షాపింగ్‌మాల్స్
- పండుగ సంబరం, ఆఫర్లతో ఆనందం

కొత్తగూడెంలోని షాపింగ్‌మాల్స్‌లో దుస్తులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 22 : జిల్లాకేంద్రంలో దసరా పండుగ సందడి నెలకొన్నది. వివిధ గ్రామాల నుంచి అనేక మంది కుటుంబసభ్యులతో వచ్చి దుస్తులు, గాజులు తదితర సామగ్రి కొంటున్నారు. దీంతో ఆదివారం పట్టణంలోని రోడ్లన్నీ జనాలతో నిండిపోయాయి. కొత్తగూడెంలోని ఎంజీరోడ్, చిన్నబజార్, పెద్దబజార్, సూపర్‌బజార్ తదితర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. సాయంత్రం బస్టాండ్, రైల్వేస్టేషన్లు ప్రజలతో సందడిగా మారాయి. దసరా పండుగ అనగానే అందరికీ వ్యాపారులు, సంస్థలు కొనుగోలుదారులను ఆకర్షించడానికి భారీగా ఆఫర్లు ప్రకటిస్తారు. సీజన్‌లో వ్యాపారాలు ప్రత్యేక డిస్కౌంట్‌లను అందిస్తున్నారు. దీంతో ప్రజలు షాపింగ్‌మాల్స్‌కు క్యూ కడుతున్నారు. పండుగ సీజన్‌లో దుస్తుల దుకాణాల్లో లేటెస్ట్ ఫ్యాషన్ దుస్తులను అందుబాటులో ఉంచారు. మహిళల కోసం పలురకాల వస్త్రాలు ప్రత్యేక ధరల్లో లభ్యమవుతున్నాయి. యువతను ఆకర్షించే బ్రాండెడ్ జీన్స్ అందుబాటులో ఉన్నాయి.

దసరా ఏర్పాట్లు పూర్తి

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 22 : సింగరేణి కార్మిక ప్రాంతమైన రామవరంలోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయం ఆవరణలో విజయదశమి ఉత్సవ ఏర్పాట్లు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గత 23 సంవత్సరాలుగా ప్రతి ఏడాది దేవాలయం ఆవరణలో దసరా ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈ ఏడాది కూడా రావణాసుర వధ జరిపేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం రాత్రి 7: 30 గంటలకు రావణాసుర సంహారం కోసం తగిన ఏర్పాట్లు చేశారు. షమీపూజ తర్వాత ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

ఆఫర్లు బాగున్నాయి

దసరా పండుగ, దీపావళి పండుగలకు వివిధ వస్త్రాలపై ఆఫర్లు బాగా ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని షాపింగ్ మాల్స్, వస్త్రాలయాల్లో తక్కువ ధరల్లో పట్టు చీరెలు లభ్యమవుతున్నాయి. ఆఫర్లు ఉండటంతో భారీగా చీరెలను కొనుగోలు చేశాను.

– మేళ్లచెరువు నాగదుర్గవినీత

షాపింగ్ చేయడం ఇష్టం

బతుకమ్మ, దసరా పండుగ సీజన్‌లో షాపింగ్‌మాల్స్‌లో సరికొత్త దుస్తులు, చీరెలు అందుబాటులో ఉన్నాయి. రోజురోజుకు ట్రెండ్ మారుతోంది. ఆ ట్రెండ్‌కు తగినట్టుగా వెరైటీ దుస్తులు కొనాలని ఆసక్తి కనబరుస్తారు. పండుగ సందర్భంగా షాపింగ్ చేయడం అంటే చాలా ఇష్టం.

– పల్లపోతు కవితలక్ష్మి

మహిషాసురమర్దిని రూపంలో అమ్మవారు



మహిషాసురమర్దిని..

విద్యుత్‌దీపాలతో పెద్దమ్మగుడి అలంకరణ

పాల్వంచ రూరల్, అక్టోబర్ 22 : మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఎనిమిదోరోజు ఆదివారం నిత్య పూజలతోపాటు 'సుహాసిని' పూజ నిర్వహించారు. ముత్తైదువ శ్రీవల్లిరాణిని అమ్మవారిగా భావించి అష్టోత్తర నామాలతో పూజించి సారె సమర్పించారు. దంపతి పూజలో సుబ్బారావు–రాణి దంపతులను 'శివుడు–శక్తి'గా భావించి వారికి పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అమ్మవారు మహిషాసుర మర్దిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. రంగు రంగుల విద్యుద్దీపాలతో ఆలయం, పరిసర ప్రాంతాలను అలంకరించారు.

అమ్మవారికి బంగారు చీరె బహూకరణ

పాల్వంచకు చెందిన అమ్మవారి భక్తులు సంకా రామారావు–రమాదేవి దంపతులు బంగారంతో నేచిన చీరెను ఈవో రజనీకుమారికి బహూకరించారు. బాపూజీ–కృష్ణవేణి దంపతులు బంగారు నేత్రాలను అమ్మవారికి బహూకరించారు. సిరిసిల్ల గ్రామానికి చెందిన చేనేత కళాకారుడు అగ్గిపెట్టెలో పట్టే చీరెను బహూకరించారు. కార్యక్రమంలో ఈవో రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహీపతి రామలింగం, ధర్మకర్తలు పాల్గొన్నారు.

11వ వార్డులో మహా అన్నదానం

రామవరం, అక్టోబర్ 22 : కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో ఉన్న వన్నందాస్‌గడ్డలో జర్పుల మోహన్‌చంద్ర ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. కౌన్సిలర్ భూక్యా శ్రీనివాస్, సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు అన్నదానాన్ని ప్రారంభించారు. చెడుపై మంచి విజయం సాధించడమే విజయదశమి అని అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బానోత్ చందర్, జర్పుల మోహన్, అజ్మీరా పూర్ణ, నివాస్, మంజీ, వంశీ, శివ, వినోద్, కమల, జానకి, లక్ష్మి, వీర, భారతి, తులసి, స్వర్ణ పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

జిల్లా ప్రజలకు కలెక్టర్ విజయదశమి శుభాకాంక్షలు

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 22 : జిల్లా ప్రజలకు కలెక్టర్ ప్రియాంక ఆల విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. మన ఆచార, సంప్రదాయాలకు ప్రతీక ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటే పూల పండుగ బతుకమ్మ వేడుకలను 9రోజులపాటు ఘనంగా నిర్వహించుకున్నామన్నారు. అమ్మవారి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సోమవారం దసరా పండుగను కుటుంబ సమేతంగా జరుపుకోవాలని, అందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.

నేడు ప్రజావాణి రద్దు

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 22 : ఈ నెల 23వ తేదీ సోమవారం దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నందున ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు డీఆర్‌వో రవీంద్రనాథ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. అధికారులు అందుబాటులో ఉండని కారణంగా ప్రజలు ఈ విషయాన్ని గమనించి కలెక్టరేట్‌కు రావొద్దని పేర్కొన్నారు.